క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

బోడుప్పల్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు కాలనీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఒక ప్రకటనలో వెల్లడించారు. 11కేవీ ఆర్ఎన్ఎస్ ఫీడర్, 33/11కేవీ ఇందిరానగర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. సాయినగర్, ఆర్ఎన్ఎస్ బస్టాప్, ఆర్ఎన్ఎస్ గ్రీన్‌హోమ్స్, ఆర్ఎన్ఎస్ ఫేస్–3, రాయల్ మెడోస్, బాలచిత్తారి నగర్, రాజలింగం కాలనీ ఫేస్–1, 2, మహాలక్ష్మీనగర్, అమ్మసాని వెంకట్‌రెడ్డి కాలనీ, అంజయ్య ఎన్‌క్లేవ్, సూరజ్‌నగర్, టెలిఫోన్ కాలనీ, బాలాజీ నగర్, లక్ష్మారెడ్డికాలనీ కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ కృపానంద్ ఫీడర్, ట్యాంక్‌బండ్, ఆర్.కె.నగర్ ఫీడర్ల పరిధిలో శుక్రవారం మరమ్మతులు జరుగుతాయని ఏడీఈ యాదగిరి తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు ఆనంద్‌బాగ్, తాళ్లబస్తీ, విమలాదేవినగర్, విష్ణుపురి కాలనీ, శివపురి కాలనీ, కృపానంద్ అపార్ట్‌మెంట్స్, రమణ ప్యారడైజ్, చాణక్యపురి కాలనీ, ఆర్.కె.నగర్, సినీపోలీస్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేటి నుంచి నాచారం గ్రామ బొడ్రాయి వార్షికోత్సవం

మల్లాపూర్: నాచారం గ్రామ బొడ్రాయి పంచమ వార్షికోత్సవాన్ని శుక్రవారం వేదాంత నర్సింహమూర్తి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు బొడ్రాయి కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం గణపతి పూజ, బొడ్రాయి అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. 23వ తేదీ ఆదివారం ఒగ్గు బృందంచే ఒగ్గు కథ, బోనాల కార్యక్రమంతో ముగుస్తుందని పేర్కొన్నారు.

సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లను అందజేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి

ఉప్పల్: మధురా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిలుకానగర్‌లో మూడు నెలలుగా ఉచితంగా కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మధురా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాగిడి లక్ష్మారెడ్డి హాజరై సర్టిఫికెట్లను అందజేశారు. లక్కీ డ్రాలో నలుగురు మహిళలకు ఉచితంగా కంప్యూటర్ పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో పి.నర్సింహారెడ్డి, అబ్దుల్ రషీద్, వంజరీ సంతోష్, సాయిబాబా, నరేష్, గజ్జల రాజు, శ్రావణ్‌కుమార్, పవన్ యాదవ్, అజయ్, పవన్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్



పట్టాలు అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్‌లో జీవో–58 ద్వారా మంజూరైన పట్టాలను గురువారం కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేతల ప్రభుత్వం అన్నారు. రాష్ట్ర పథకాలు ఇతర రాష్ట్రాలకు మోడల్‌గా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన జీవో–58 పేదల్లో వెలుగులు నింపుతోందన్నారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్, జవహర్‌నగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగన్న బాలరాజు, డివిజన్ అధ్యక్షుడు జక్కుల భాస్కర్, ఉపాధ్యక్షుడు నగేష్, నాయకులు చందు, కృష్ణ, గణేష్, వాహెబ్, రుక్ముద్దీన్ కాలనీవాసులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



బూత్ కమిటీ లిస్ట్‌ను బాలచందర్‌కు అందజేస్తున్న బీజేపీ నేతలు

మల్లాపూర్: బూత్‌స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ బాలచందర్ అన్నారు. గురువారం నాచారం డివిజన్‌కు చెందిన 42 బూత్ కమిటీల లిస్ట్‌ను అందజేశారు. యువత నాయకత్వాన్ని బలపర్చాలని అన్నారు. ప్రజలు బీజేపీని ఎంతో ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. నాచారం డివిజన్ అధ్యక్షుడు మల్కా ప్రకాష్, జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షులు రాగిరి మోహన్‌రెడ్డి, నవీన్, ప్రతాప్‌రెడ్డి, గోపి ఉన్నారు.

ఆదాయం ఫస్ట్.. సేఫ్టీ నెక్ట్స్

నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారస్తులు

- రంగంలోకి దిగిన జీహెచ్ఎంసీ అధికారులు
- 31 గోడౌన్లు, 51 సెల్లార్ల గుర్తింపు
- నోటీసులు జారీ, జరిమానా విధింపు

కాప్రా: పెద్ద పెద్ద షాపింగ్ కాంప్లెక్స్, మాల్స్, వ్యాపార సముదాయాల నిర్వాహకులు ఆదాయం ఫస్ట్, సేఫ్టీ నెక్స్ట్.. అనే మాదిరిగా ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. నగరంలో ఇటీవల వరుస అగ్నిప్రమాద ఘటనలు జరుగుతున్నా.. ఎంతో మంది ప్రాణాలు మంటల్లో కలిసిపోతున్నా వాటిని వీరు పట్టించుకోవడంలేదు. కాప్రా సర్కిల్‌లో ధనార్జనే ధ్యేయంగా యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించి తమ వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. నగరంలో జరుగుతున్న వరుస ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని జీహెచ్ఎంసీ అధికారులు రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో నోటీసులు జారీ చేస్తూ జరిమానాలు విధిస్తున్నారు.



నాచారంలో నివాసాల మధ్య ఉన్న టింబర్ డిపో



ఈసీఐఎల్‌లోని పిస్తాహౌస్‌ను పరిశీలిస్తున్న అధికారులు

స్పెషల్ టీమ్‌తో సర్వే..

సర్కిల్‌లో నివాస ప్రాంతాల మధ్య ప్రమాదకరంగా ఉన్న గోడౌన్లు, సెల్లార్లను గుర్తించేందుకు సర్కిల్ అధికారులు ప్రత్యేక బృందంతో సర్వే చేపట్టారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్ ప్రసాద్ నేతృత్వంలో ఇద్దరు టీపీఎస్‌లు, ముగ్గురు న్యాక్ ఇంజినీర్లు, చైన్ మెన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందం ప్రమాదకరమైన గోడౌన్లు, సెల్లార్లను గుర్తించింది. అగ్నిప్రమాదానికి కారణమయ్యే పరిశ్రమలు, గోడౌన్లు నివాస ప్రాంతాల నుంచి దూరంగా తరలించాలని, సెల్లార్లలో నిర్వహిస్తున్న వ్యాపారాలను తొలగించాలని నోటీసులు ఇచ్చారు.

31 గోడౌన్లు.. 51 సెల్లార్లు..

కాప్రా సర్కిల్ పరిధిలో ఇలా నిబంధనలు ఉల్లంఘించి వ్యాపారాలు కొనసాగిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. 15 రోజులుగా కాప్రా సర్కిల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలు పాటించని వ్యాపార సముదాయాలకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటి వరకు సర్కిల్ పరిధిలో 31 గోడౌన్లు, 51 సెల్లార్లు ప్రమాదకరంగా ఉన్నట్లు అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేశారు. వీరు ఎలాంటి ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని అధికారులు తేల్చి చెబుతున్నారు. 15 రోజుల్లో గోడౌన్లను తరలించాలని, సెల్లార్లను ఖాళీ చేయాలని హెచ్చరించారు.

అధికారులు నోటీసులిచ్చింది వీటికే..

పిస్తా హౌజ్	ఏఎస్‌రావునగర్
ఆర్ఎస్ బ్రదర్స్	ఏఎస్‌రావునగర్
కల్యాణ మహాలక్ష్మి సిల్క్	ఏఎస్‌రావునగర్
ఏటీసీ(అనిల్ ట్రేడింగ్ అండ్ కో)	ఏఎస్‌రావునగర్
పరివార్ హోటల్	ఏఎస్‌రావునగర్
స్వాగత్ గ్రాండ్ హోటల్	ఏఎస్‌రావునగర్
పిజ్జా హట్	ఏఎస్‌రావునగర్
అనుటెక్స్	ఏఎస్‌రావునగర్
మెట్రో ఆప్టికల్స్	ఏఎస్‌రావునగర్
విజయ సేల్స్	ఏఎస్‌రావునగర్
బాంటియా	ఏఎస్‌రావునగర్
అను ఫర్నీచర్	ఏఎస్ రావునగర్
ఎఫ్‌డబ్ల్యూడీ ఫర్నీచర్ వరల్డ్	ఏఎస్‌రావునగర్
విద్యా టవర్స్	ఏఎస్‌రావునగర్
భవానీ ప్లాజా	ఈసీఐఎల్
జూపల్లి ఆర్కెడ్	ఈసీఐఎల్
బిర్యానీ జోన్	చక్రీపురం
రత్నా హోటల్	చక్రీపురం
శ్రీరామ బేకరీ	చక్రీపురం
రంగోళి ఫర్నీచర్	చక్రీపురం
రామ్‌రాజ్ కాటన్	చక్రీపురం
హెచ్‌డీఎఫ్‌సీ భవనం	నాగార్జుననగర్ కాలనీ
బజాజ్ ఎలక్ట్రానిక్స్,బండారి బుచ్చిరెడ్డి ఎడిఫిస్	నాగార్జుననగర్ కాలనీ
కోటక్ మహీంద్ర భవనం	ఏఎస్‌రావునగర్
శ్రీశివం కాంప్లెక్స్	కుషాయిగూడ
వేస్ట్ పేపర్ మర్చంట్ స్క్రాప్ గోడౌన్	చర్లపల్లి
రిలయన్స్ డిజిటల్	నాచారం
బాలాజీ టింబర్ డిపో	నాచారం
బాంబే క్లాత్ స్టోర్	నాచారం
హోమ్లీ ఫర్నీచర్	నాచారం

జాబితాలో కుషాయిగూడ భవనం కూడా..

ఇటీవల కుషాయిగూడలో అగ్నిప్రమాదం సంభవించి టింబర్ డిపో కూడా అధికారుల స్పెషల్ డ్రైవ్ జాబితాలో ఉంది. ఈ ఘటనలో ఐదేళ్ల బాలుడు సహా దంపతులు సజీవ దహనమయ్యారు. ఐదుగురు తీవ్రంగా గాయపడగా మరో ఐదు కుటుంబాలు ప్రాణాలతో బయటపడ్డాయి. ఈ ఘటన జరగకముందే కాప్రా సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులు సదరు టింబర్ డిపోనకు నోటీసులు ఇచ్చారు. అయినా సదరు టింబర్ డిపో నిర్వాహకుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి.

చర్యలు తప్పవు



సర్కిల్ పరిధిలో నివాస ప్రాంతాల మధ్య ప్రమాదకరంగా ఉన్న గోడానుల, సెల్లార్లను గుర్తించి నోటీసులు జారీ చేశాం. ఇందులో గోడౌన్లను దూరంగా తరలించాలని, సెల్లార్లలో నిర్వహిస్తున్న వ్యాపారాలను 15 రోజుల్లో తొలగించాలని ఆదేశించాం. నోటీసులకు స్పందించకుండా తీరు మార్చుకోకుంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో తొలగించి జరిమానా విధిస్తాం. సర్కిల్ పరిధిలో ఎవరైనా నిబంధనలు పాటించకుంటే చట్టరీత్యా చర్యలు తప్పవు. – శ్రీధర్ ప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్, కాప్రా సర్కిల్

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

హోంమంత్రి మహమూద్ అలీ



రంజాన్ తోఫాలను పంపిణీ చేస్తున్న మహ్మముద్ అలీ, బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని హోంమంత్రి మహ్మముద్ ఆలీ అన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్ల మసీదు ప్రెసిడెంట్స్, ప్రధాన కార్యదర్శులు, ఇమామ్, మౌసమ్‌లకు మినిస్టర్స్ క్వార్టర్స్‌లో హోంమంత్రి మహమ్మద్ మహమూద్ అలీ చేతుల మీదుగా రంజాన్ తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ సర్వమత సామరస్యానికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సాయిజెన్‌శేఖర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు బద్రుద్దీన్, బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు కటార్ల భాస్కర్, నెమూరి మహేష్‌గౌడ్, ఇంద్రయ్య, శ్రీనివాస్, బాలరాజ్, శేఖర్, మాస శేఖర్, జహంగీర్, పాషా, పవన్, అంజి, శ్రీశైలం, ఖాన్, అరవింద్, మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ మజీద్ ఏ హజ్రా మసీదులో..

నాచారం డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ మజీద్ ఏ హజ్రా మసీదులో గురువారం రంజాన్ కానుకలను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్, రఫిక్, మేకల ముత్యంరెడ్డి, సంజీవ, చంద్రశేఖర్, కట్ట బుచ్చన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల ఇఫ్తార్ విందులు

మల్లాపూర్ జమా మసీద్, ఈద్గా మసీద్, కేఎల్‌రెడ్డినగర్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి హాజరై ఖర్జూరం తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. మజీద్ కమిటీ సభ్యులు ఎండీ అల్తాఫ్, మానూద్, మీర్ ఉస్మాన్ అలీ, హఫీజ్‌ఖాన్, మోయిన్‌పాషా, అన్వర్ పాషా, బాబుబాయ్, జహంగీర్, డివిజన్ అధ్యక్షుడు పల్లా కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్ తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ..

గౌతంనగర్: మిర్జాల్‌గూడకు చెందిన ప్రముఖ సంఘ సేవకులు సత్తి రాంచందర్‌రెడ్డి ముస్లింలకు గురువారం తన నివాసంలో నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ముస్లిం భాయ్ భాయ్ అన్నారు. బియ్యం, పప్పు, ఉప్పుతో పాటు షీర్‌ఖుర్మా తయారు చేసుకునే వస్తువులను పంపిణీ చేశారు. సీతా బాబుయాదవ్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరానగర్‌లో కానుకలను అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్



మిర్జాల్‌గూడలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న సత్తి రాంచంద్రారెడ్డి

కళాకారులు పాటల యుద్ధం చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్



మాట్లాడుతున్న ఎన్.బాలమల్లేష్

అల్వాల్: మతోన్మాదం, ప్రజావ్యతిరేక పాలనపై కళాకారులు పాటల యుద్ధం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.బాలమల్లేష్ అన్నారు. గురువారం యాప్రాల్‌లో జరిగిన తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారుల శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో కళాకారుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. రాష్ట్ర సాధనలో కళాకారులు ఊరు, ఊరున ఉవ్వెత్తున ఉద్యమ గీతాలు ఆలపించి గొప్ప పాత్ర నిర్వహించారని పేర్కొన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మతోన్మాదం పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా గౌరవ అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, ఏఐటీయూసీ నాయకులు ప్రజా నాట్యమండలి ఇన్‌చార్జి శంకర్‌రావు, అల్వాల్ సీపీఐ కార్యదర్శి సహదేవ్, సహాయ కార్యదర్శి చంద్రయ్య, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు ప్రమీల, రాములు, బాలు, కనకయ్య, స్వరాజలక్ష్మీ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా ప్రారంభోత్సవానికి ఆహ్వానం



హోంమంత్రి మహమూద్ అలీని ఆహ్వానిస్తున్న బద్రోద్దీన్, ప్రవీణ్‌ముదిరాజ్

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్‌లో నూతనంగా నిర్మించిన ఈద్గా ప్రారంభోత్సవానికి రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని ఆహ్వానించారు. గురువారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మహమూద్ అలీని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ముదిరాజ్, ఉప్పల్ నియోజకవర్గం మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎం.కె.బద్రోద్దీన్ కలిసి ఆహ్వానించారు. రూ.52 లక్షలతో నిర్మించిన ఈద్గా ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డితో పాటు మంత్రి మల్లారెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత హాజరుకానున్నారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు, ముస్లిం నేతలు పాల్గొన్నారు.

జీవోల పేరుతో దోపిడీ చేస్తున్న ప్రభుత్వం

– కాంగ్రెస్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



మాట్లాడుతున్న నందికంటి శ్రీధర్

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న ప్రజలకు ఆ భూములను క్రమబద్ధీకరిస్తామని చెప్పి 58 జీవో కింద చేసుకున్న దరఖాస్తులను 59 కిందకు అధికారులే మార్పు చేస్తూ ప్రజలను దోపిడీకి గురిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. గురువారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని మిర్జాల్‌గూడ సత్యనారాయణ కేఫ్ తదితరుల ప్రాంతాల్లో చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానెహ్రూనగర్, ఏకలవ్యనగర్‌లలో 59 జీవో 25 శాతం రుసుం వసూలు చేయాల్సి ఉండగా 40 శాంతం వసూలు చేస్తున్నారని, ప్రభుత్వానికి డబ్బులు మాత్రమే కావాలని, ప్రజల బాగోగులు అవసరం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అధ్యక్షులు టి. వెంకటేష్ యాదవ్, జీవన్‌రెడ్డి, గుత్తి రాంచందర్, సానాది శంకర్, మోహన్‌యాదవ్, ప్రవీణ్, యాదగిరి, భరత్, షేక్, సాయి, దశరథ్, పూస శేఖర్, రామ్, శ్రీనివాస్, ఆశ, ఉమేష్ సింగ్, లింగారెడ్డి, వినోద్‌యాదవ్, వాసు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిరక్షణకు కృషి

బోడుప్పల్: ప్రభుత్వ, భూములు, స్థలాల పరిరక్షణకు అధికారులు, పాలకవర్గం కృషి చేయాలని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ అఖిలపక్ష కమిటీ అధ్యక్షుడు ఎల్లగోని బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. బోడుప్పల్‌లోని ప్రభుత్వ భూములు కాపాడాలంటూ గురువారం ఆయన కమిషనర్, మేయర్, తహసీల్దార్, అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు వినతి పత్రాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత మంది దళారులు ఒక ముఠాగా ఏర్పడి సర్వే నంబరు 63/1లోని రోడ్లు, పార్కులు, ఖాళీ ప్లాట్స్‌ను కబ్జా చేస్తూ విక్రయిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం పేదలకు ఇచ్చిన 60 గజాల స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి కబ్జా చేస్తున్నారన్నారు. కబ్జా చేసిన స్థలంలో చిన్న రూంలు కట్టి రూ.15 లక్షలకు విక్రయిస్తున్నారన్నారు. ఇదే విషయమైన మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కమిషనర్, తహసీల్దార్ తమ వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి ఎన్‌ఓసీ ఇచ్చిన తర్వాతే కట్టుకునేందుకు అనుమతులు ఇవ్వాలన్నారు. దళారుల ముఠా ఆటకట్టించేందుకు మున్సిపల్ కౌన్సిల్‌లో పాలకవర్గం తీర్మానం చేసి దొంగ పట్టాలను విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా మంత్రి కొప్పుల జన్మదిన వేడుకలు



ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నేతలు మంత్రి కొప్పుల ఈశ్వర్ జన్మదిన వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నివాసానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఇర్షాద్‌ఖాన్, మాస శేఖర్, రఫీక్, సమీర్, సయ్యద్ నబీ తదితరులు పాల్గొన్నారు.

నేడు అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం

కీసర: కీసర రైతు వేదిక కార్యాలయం వద్ద అగ్రి లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను గౌరవ జిల్లా న్యాయమూర్తి బి.సురేష్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు ప్రారంభించనున్నట్లు కీసర మండల వ్యవసాయాధికారి మాధవిలత తెలిపారు. చట్టాలు, రైతు సంక్షేమ పథకాలు, జిల్లా వ్యవసాయశాఖ సమన్వయంతో అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు పాల్గొనాలని ఆమె సూచించారు. రైతులు భూసమస్యలపై న్యాయ సలహాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి పాల్గొంటారని ఆమె తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో మల్లాపూర్ డ్వాక్రా పొదుపు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో వార్షిక సాధారణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. మహిళా సంఘాల గ్రూప్ సభ్యులు లోన్లు తీసుకొని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఇటీవల పొదుపు సంఘాలకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస్, వెంకటేష్, స్వామి, గోపాల్, ఊర్మిల, రాజు, మంగ, పర్వీన్, ఉప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం



బలరాంనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: బలరాంనగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. గురువారం కాలనీలో ఆయన పర్యటించారు. యూజీడీ పైపులైన్లు పాతవి కావడంతో తరచూ డ్రైనేజీ సమస్య తలెత్తుతోందని కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాల మార్పిడితో పాటు నూతన స్తంభాలు అవసరమున్నాయని తెలిపారు. రోడ్లు దెబ్బతిన్నాయని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులతో చర్చించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నోయల్, గోపాల్‌సింగ్, సూరజ్‌సింగ్, రామ్‌లఖన్, క్రాంతి, నాగరాజు, సతీష్, రాజు, మంజుల పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపండి



భక్షిగూడలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: స్థానిక సమస్యలను తెలుసుకునేందుకు గురువారం కార్పొరేటర్ ప్రభుదాస్ డివిజన్ పరిధిలోని భక్షిగూడలో పాదయాత్ర చేశారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి, డ్రైనేజీ సమస్యలను వారు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. వాటర్ వర్క్స్ అధికారులతో మాట్లాడిన కార్పొరేటర్ సమస్యలకు పరిష్కారం చూపాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ మేనేజర్ వేణుగోపాల్, స్థానిక నేతలు దూసరి నవీన్‌గౌడ్, సత్తిరెడ్డి, భుపాల్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత



గౌతంనగర్: ఇటీవల సాయినగర్‌లో కరెంటు షాక్‌తో కాలిపోయిన కూరగాయల డబ్బా నిర్వాహకులు జిన్న వెంకటేష్‌కు మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ తరపున రూ.25 వేల చెక్కును గురువారం స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్ చేతులమీదుగా అందజేశారు.